
# అల్లరి
ALLARI



## చెప్పుకోండి

- రాళ్ల అడుగున విల్లు. విల్లు కొసన ముళ్లు?

  **- తేలు**
- ఈగ ముసరని పండు! ఇంటి లోనుండు?

  **- నిప్పు**
- అన్నం పెడితే ఎగరదు. పెట్టక పోతే ఎగురుతుంది?

  **- విస్తరాకు**



## పెద్దల మాట




ఈ లోకాన్ని
ఏ ఇద్దరూ
ఒకే మాదిరిగా
చూడరు.

**- స్వామి వివేకానంద.**

## టంగ్ ట్విస్టర్స్

Specific Pacific
Six sticky skeletons
Fresh fried fish

## రంగులేయండి




**చుక్కల ఆధారంగా బొమ్మ గీసి, రంగులు వేయండి.**

## దుస్తులు

**ఒకపారి** ఆ ఊరి నవాబ్ సాబ్ ఇంట్ల దావత్‌కు ఊరందర్ని పిలిశిండ్లు. నసీరుద్దీన్‌ను గూడ దావత్‌కు రమ్మని చెప్పిండ్లు. రోజు ఏసుకొనే పాత బట్టలే ఏసుకొని.. ఎప్పటిలెక్కనే గాడిది మీదెక్కి దావత్‌కు వోయిండు. ఈయినె బట్టలు, గాడిది, రూమాలు సూశి.. సుట్టాల దస్తర్‌ల గాకుండ, ఆఖరికి కూసోవెట్టి రెండుమూడు డబల్‌రొట్టెలు ముందటేశిండ్లు. అటీటు సూశి.. కతంత సమజయి ఉరుక్కుంట ఇంటికి వోయిండు. కొత్త షేర్వాణి, చెమ్కీల రుమాలు, మెరిశే బట్టలేసుకొని.. దావత్ కాడికి మల్లచ్చిండు. నసీరుద్దీన్‌ను సూడంగనే సలాంజేశి.. సుట్టాలు గూసున్న బిస్తర్ కాడికి తీస్కవేయిండ్లు పనోళ్లు. పల్లెం నిండ మటను, రొట్టెలు, బిర్యాని, కీరు.. గిట్ల తీరొక్కయి అడ్డిచ్చిండ్లు. అందరు ఆదరబాదరగా తినవట్టిండ్లు. నసీరుద్దీన్ అటీటు జూశి.. రొండు శేతులతోని మటను, రొట్టెలు దీస్కొని బట్టలకేశి బర్ర బర్ర రుద్దవట్టిండు. గది జూశిన నవాబ్ సాబ్ పరేషానై.. ''అరే మియా! గదేం పాగల్ పని!'' అంట అడిగిండు. ''జనాబ్? నా బట్టలు సూశినంకనే నన్నీడికి వంపిచ్చిండ్లు. అందుకనే.. బట్టలకే తినిపిస్తున్న!'' అంట జెప్పిండు.

... ✍ పత్తిపాక మోహన్



## మీకు తెలుసా?



'గూస్‌బంప్స్' అంటే అందరికీ తెలిసే ఉంటుంది. సాధారణంగా చలి పెట్టినా, భయం కలిగినా, ఎక్కువ ఉత్సాహంగా ఉన్నా.. శరీరంపై ఉండే వెంట్రుకలు నిక్క బొడుచుకుంటాయి. ఆ సమయంలో వెంట్రుకల కుదుళ్ల దగ్గర చర్మంపై చిన్నచిన్న గడ్డలు కనిపించడాన్నే 'గూస్‌బంప్స్'గా వ్యవహరిస్తారు. అయితే, ఇలా గూస్‌బంప్స్ కేవలం మనుషుల్లోనే కాదు.. అన్ని రకాల జంతువుల్లోనూ వస్తాయట.

## పద్యం - భావం

**విద్యలేనివాడు విద్వాంసుచేరువ**
**నుండగానే పండితుండుగాడు**
**కొలని హంసలకడ గొక్కెర లున్నట్లు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**తాత్పర్యం :** విద్య నేర్చుకోలేని వాడు ఎంతపెద్ద విద్వాంసుడి దగ్గర ఉన్నప్పటికీ.. వాడు ఎప్పటికీ పండితుడు కాలేడు. సరోవరంలోని రాజహంసల సమూహంలో కొంగ ఉన్నంత మాత్రాన.. అది రాజహంస అవ్వదు కదా!